


# దాహం

ఎక్కడో వుండే సూర్యుడు భూమ్మీద వాలినట్టున్నాడు. నేల పెనంలా కాలిపోతోంది.

మండల కార్యాలయం కూడా మలమలమాడిపోతోంది. రంగారావు ఓ బెంచిమీద కూర్చుని మాటిమాటికీ పక్క రూముకేసి చూస్తున్నాడు. చాలా ఆత్రంగానే కాకుండా మరెంతో ఆశగా కూడా చూస్తున్నాడు. వరండామీదకొచ్చిన ఎండ ఎర్రెర్రగానే కాకుండా గీరగీరగా కూడా వుంది.

ఎండను చూస్తుంటే రంగారావుకు తనవూరు కళ్ళల్లో కదిలింది. పగుళ్ళు తేలిన నేల శతాధిక వృద్ధురాలి ముఖంలా అనిపించింది. అసలే వర్షాధార భూములు. పంటలు అంతంత మాత్రం. పైగా ఈ ఏడు నీటి ఎద్దడి. మంచినీటి కోసం మూడు మైళ్ళు వెళ్ళాల్సిన దుస్థితి. కిందటేడాది వూరివాళ్ళంతా తలాకొంత వేసుకొని బోర్‌వేయించారు. అది ఓ సంవత్సరానికే వట్టిపోయింది. మళ్ళీ మరోటి తవ్వించాలంటే డబ్బు కావాలి. పైగా మంచినీరు ఫలానా చోట పడుతుందనే గ్యారంటీ లేదు. అందుకే వూళ్ళో వాళ్ళెవరూ బోరు తవ్వించే ధైర్యం చేయలేకపోయారు.

"సుందర శేఖరం గార్ని అయ్యగారు పిలుస్తున్నారు" అంటూ బంట్రోతు వచ్చాడు.

రంగారావు తనపక్కన కూర్చున్న వ్యక్తివంక చూశాడు. అతను లేచి ఆఫీసరు గదిలోకెళ్ళాడు.

జిల్లాలో మూడొందల బోర్లు కేటాయించారు. నీటి ఎద్దడి ఉన్న గ్రామాల్లో వాటిని వెంటనే వేయించాలని కలెక్టరు ఆదేశించారు' అనే వార్త చదివిన తర్వాత తమ వూరివాళ్ళంతా ఎంతో ఆశపడ్డారు. తమ వూళ్ళో ఒక్క బోరు కూడా లేదనీ, నీటికోసం అలమటిస్తున్నామనీ దరఖాస్తు పెట్టుకున్నారు. గవర్నమెంటువారు తమంత తామే వచ్చి బోరు వేస్తారని ఇంతకాలం ఎదురుచూశారు. పనికాలేదు. దాంతో మండలాఫీసుకెళ్ళి, పనిచేయించుకొచ్చే బాధ్యత తనపై పడింది. ఇందుకు రెండు కారణాలున్నాయి. వూళ్ళో కల్లా కాస్త చదువుకున్నవాడు తనేకావడం ఒకటి. బోర్లు శాంక్షన్‌చేసే ఆఫీసరు తనకు బంధువు కావడం మరొకటి. అతను బాగా సంపాదించాడు. పెద్ద బంగళా కట్టాడు. రెండేళ్ళ క్రితం ఓసారి తను వాళ్ళింటికెళ్లాడు. అతను ఇంట్లో లేడు. జానకి తనను సాదరంగా ఆహ్వానించి, భోంచేసి వెళ్లేదాకా వూరుకోలేదు.

"రంగారావు గారు మీరేనా? అయ్యగారు రమ్మన్నారు" అని బంట్రోతు అనడంతో రంగారావు ఒక్కసారి ఉలిక్కిపడి లేచాడు.

లాల్చీ సర్దుకుని, బెంచి కింద వదిలిన హవాయి చెప్పులేసుకుని రంగారావు, ఆఫీసరు రూమ్‌లోకి అడుగుపెట్టాడు.

"నమస్కారం" అన్నాడు రంగారావు.

ఓ చిరునవ్వు నవ్వి "ఏంటి సంగతి" అన్నట్లు చూశాడు చిట్టబ్బాయి.

"మావూరి వాళ్ళందరం మంచినీటికి కటకట లాడిపోతున్నాం. ఒక బోర్ వేయించవలసిందిగా కోరుతూ దరఖాస్తు పెట్టుకున్నాం. మీరు శాంక్షన్ చేస్తే....." అని ఆగి, చిట్టబ్బాయి వంక చూశాడు రంగారావు.

"ఇంతకీ ఇతను తనను గుర్తుపట్టాడా" అని సందేహించి...

"నేను జానకి....." అని చెప్పుకోబోతుంటే,

"తెలుసు, తెలుసు" అని నవ్వి,

"మీ వూళ్ళో బోర్ వేయాలంటే చాలా ప్రయాసతో కూడుకున్న పని. రెండు మూడు చోట్ల ట్రై చేస్తేకానీ పడకపోవచ్చు. చాలా ఖర్చవుతుంది" అన్నాడు చిట్టబ్బాయి.

రంగారావు చిట్టబ్బాయి వంక చూశాడు. ఇంతకుముందు చామనఛాయ రంగులో వుంటేవాడు. ఇప్పుడు కాస్త రంగు తేలాడు. అప్పుడు సన్నగా వంకీల జుత్తుతో వుండేవాడు. ఇప్పుడు బట్టతలా, పెద్ద బొజ్జా....

రంగారావు మాట్లాడకపోవడం చూసి,

"ఏమంటారు" అన్నాడు చిట్టబ్బాయి.

"మీరన్నట్లుగా చాలా ఖర్చవుతుందనే మాకు మేముగా బోరు తవ్వించడానికి వెనుకాడాం. అయితే, గవర్నమెంట్‌కు ఆ ఖర్చు పెద్దలెక్కలోది కాదని...."

"అంటే ఏవిటి మీవుద్దేశం? ప్రభుత్వం ఎంత దుబారా చేసినా ఫర్వాలేదనా?"

"అబ్బే, నా ఉద్దేశం అదికాదండి..."

"మీ వూళ్ళో నాలుగుచోట్ల ప్రయత్నించే బదులు ఆ దబ్బుతో నాలుగూళ్ళకి నాలుగు బోర్లు వేయించొచ్చు ఏమంటారు?"

"అలాగని మేం తాగేనీళ్ళు లేక చచ్చినా ఫర్వాలేదంటారా" అన్నాడు రంగారావు ఏడవలేక నవ్వుతూ.

"ఆమాట నేనెందుకంటాను? నా పాయింటును మీరు కాచ్ చేసినట్టులేదు. బాగా ఖర్చవుతుంది" అన్నాడు చిట్టబ్బాయి పిల్లికళ్ళను చిట్లించిచూస్తూ.

"అవును, ఆమాట ఇందాక కూడా అన్నారు"

"అందుకే, ఓ వెయ్యివ్వండి. మీవూళ్ళో బోర్ వేయిస్తాను".

"పేపర్లో.. గవర్నమెంట్..."

"గవర్నమెంటే సరా! పని జరగాలంటే నేనూ నాకింది ఉద్యోగులూ చాలా కష్టపడాలి. వెయ్యిస్తేనే మీ పనవుతుంది".

"లంచమా..." అంటూ పని చెడుతుందేమోనని రంగారావు మాట మింగబోయాడు.

"మీ ఇష్టం. మీరేమనుకున్నా ఫర్వాలేదు. వేయించమంటారా? మీ ప్రయత్నాలు మీరు చేసుకుంటారా?" అన్నాడు చిట్టబ్బాయి చిరాగ్గా.

"రెండేళ్ళుగా మాకు సరిగా పంటలు పండలేదు. మేం ఇచ్చుకునే స్థితిలో లేం. మీరే దయదలచాలి" అన్నాడు రంగారావు టేబుల్‌మీది పేపర్ వెయిట్‌ను తిప్పుతూ.

"అయితే మీరికవెళ్ళొచ్చు" అంటూ చేతిలోని ఫైలును టేబుల్‌కో మూలనవున్న ట్రేలో విసిరాడు చిట్టబ్బాయి.

రంగారావుకు పట్టరాని కోపం వచ్చింది. అయినా నిగ్రహించుకుని, "వెళ్ళొస్తాను" అంటూ కుర్చీలోంచి లేచాడు.

ఎర్రగా కందిన అతని ముఖం చిట్టబ్బాయికి పట్టలేదు.

❀❀❀

సాయంత్రం అయినా ఇంకా గుబురుగానే వుంది. నేలింకా చల్లారలేదు. ఏ చెట్టూ అందుకు ప్రయత్నించడం లేదు.

జానకి నిద్రలేచింది. ముఖం కడుక్కుని జడవేసుకుంది. తర్వాత, టీ పెట్టి, తనో కప్పు తాగి, ఫ్లాస్కులో పోసింది. హాల్లోకొచ్చి కుర్చీలో కూర్చొని ఓ వీక్లీ తెరిచింది.

ఇంటి ముందు పచ్చని పచ్చిక. ఓ మూల జామచెట్టు. మరో పక్క రెండు కొబ్బరిచెట్లు. చెట్లన్నీ మనుషులమీద పగ తీర్చుకోడానికి కాబోలు తపస్సు చేసుకుంటున్నాయి 'నిశ్చల' దీక్షతో.

చీకటి ముసుగు ధరిస్తోంది ధరిత్రి. అక్షరాలు అలుక్కుపోయినట్టవడంతో జానకి చదువుతున్న సీరియల్‌ను ఆపి, లేచి లైటు వేసింది. టైము చూసింది. ఆరూ ఇరవై.

'ఇంక ఆయనగారొచ్చే టైమయింది" అనుకుని వంట గదిలోకి నడిచింది టిఫిన్ చేయడానికి.

పనయ్యాక హాల్లోకొచ్చి మధ్యలో ఆపిన సీరియల్ చదవడం మొదలెట్టింది జానకి.

ఓ పావుగంటకి చిట్టబ్బాయి స్కూటర్ ఇంటి ముందాగింది. ఆపసోపాలు పడుతూ ఇంట్లోకొచ్చాడు. బాత్‌రూంకెళ్ళి స్నానం చేశాడు. ఈలోగా జానకి సీరియల్ పూర్తిచేసి, టిఫిన్ టేబుల్‌మీద పెట్టింది. చిట్టబ్బాయి టిఫిన్ లాగించి బట్టలేసుకుని,

"నేనెళ్తున్నా. మా క్లబ్ ఎన్నికలు దగ్గరపడుతున్నాయి. నేను గెలవాలంటే చాలా మందిని కూడగట్టుకోవాల్సి వుంది. నేనొచ్చేటప్పటికి పన్నెండు దాటుతుంది" అని గోడకు చెప్పినట్లు చెప్పి వెళ్ళిపోయాడు.

జానకి గబగబా వెళ్తున్న చిట్టబ్బాయిని వెనక నుంచి చూసింది. బాతు నడిచి వెళ్తున్నట్లు అనిపించింది.

"మొద్దబ్బాయ్, బొద్దబ్బాయ్, మందబ్బాయ్" అనుకుంది కోపంగా.

పన్నెండు గంటలదాకా ఇంట్లో ఒంటరిగా ఏడవాలి. ఛీఛీ, రోజురోజుకీ బతుకు బితుకుబితుకుమంటూ ఏ సరదా లేకుండా నిస్సారంగా అయిపోతోంది. టీవీ చూడ్డం, పుస్తకాలు చదవడం, నిద్దరోవడం, 'మందబ్బాయ్' వచ్చేక అన్నం పెట్టడం....

చిట్టబ్బాయ్ మొదట్లో 'ముద్దబ్బాయ్'లా వుండేవాడు తనకి. సన్నగా, తనతో మంచిగా, సుఖంగా.....

ఎల్.డి.సి. ఉద్యోగంతో వచ్చే జీతం డబ్బులు జాగ్రత్తగా ఖర్చుచేస్తే బొటాబొటీగా సరిపోయేవి. నెలకో సినిమా కెళ్లేవారు. అలా వెళ్ళి చూడ్డం ఎంతో సరదాగా వుండేది. యుడిసి ప్రమోషన్ కోసం ఆయనెంతో ఆశగా ఎదురుచూసే వారు. ఆయనతోపాటు తనూనూ, జీతం పెరుగుతుందనీ, దాంతో ఇంటికి చిన్నచిన్నవి సమకూర్చుకోవచ్చనీ తనూ ఎదురు చూసేది. ఇంతలో ఐశ్వర్య పుట్టింది. కొద్ది నెలలకే ఆయనకు ప్రమోషనూ వచ్చింది. ఐశ్వర్య పుట్టిన వేళా విశేషమని ఆయన పొంగిపోయారు. తనూ మురిసిపోయింది.

కొంత కాలానికి ఆయన రేషన్ విభాగానికి మారారు. అప్పటి నుంచీ లంచాలు మరిగారు. మొదట తను లంచాలు తీసుకోవద్దంది. పట్టుబడితే ఉన్న ఉద్యోగం కాస్తా వూడిపోతుందని భయపడింది. పై సంపాదన పెరిగే కొద్దీ అతను ఇంట్లో వుండడం తగ్గింది. పార్టీలూ, క్లబ్బుల కెళ్ళడం పెరిగింది. తనెంత ఆపజూసినా ఫలితం లేకపోయింది. 'మందబ్బాయ్'లో చాలా మార్పు వచ్చింది. డబ్బు తర్వాతే తనూ, ఐశ్వర్యా. లక్షలకు లక్షలు సంపాదించాడు. ఆయన అన్నగారి పేర పొలాలు కొన్నారు. తమ్ముడిపేర ఇళ్ళ స్థలాలు కొన్నారు.

ఆయన ఆఫీసుకూ, ఐశ్వర్య కాన్వెంట్‌కూ వెళితే తను ఒంటిరిగా ఇంట్లో గడపాల్సి వచ్చేది. జీవితం చాలా జిడ్డుగా తయారయిపోయింది. అతనికి డబ్బు మీద వ్యామోహం పెరగడంతోపాటు తనంటే ఆలక్ష్యం కూడా పెరగడం ప్రారంభమైంది. రాత్రెప్పుడో రావడం, భోంచేసి గుర్రు పెడుతూ నిద్రపోవడం, పొద్దుట లేచి పేపరు చదివి, ఆఫీసుకు తయారై వెళ్ళడం.

ఇక ఒంటరిగా తను... ఐశ్వర్యను ఈ సెలవుల్లో అమ్మమ్మ దగ్గరికి పంపాల్సింది కాదేమో... అదింట్లో వుంటే తనక్కాస్త కాలక్షేపం అయ్యేది...

తనిప్పుడు ఆయనకు వంటచేసి పెట్టే మనిషి. ఇల్లు ఊడ్చే మనిషి. బట్టలుతికే మనిషి. అవసరాలకు అన్నీ అందించే మనిషి. ఐశ్వర్య ఆలనా పాలనా చూసే తల్లి. భార్యగా తన స్థానం నామమాత్రం అయిపోయింది.

ఆయన తనతో సరదాగా మాట్లాడడం.. తనను సుఖపెట్టడం కోసం తాపత్రయపడడం... అప్పుడప్పుడూ తను అలగడం... తన అలక తీర్చడం... తర్వాత మరింత దగ్గరవడం... ఇవన్నీ గత కాలపు మధుర స్మృతులుగా మిగిలిపోయాయి. ఇప్పుడు తన ఇష్టాయిష్టాలతో పనిలేదు. ఆయనక్కావలసి వచ్చినప్పుడు తన పక్కలో చేరతారు. విస్కీ, బ్రాందీల కంపు... కడుపులో వికారం.

"క్లబ్బుకెళ్ళడం మానండి" అని తను ఎంతగానో కోరింది. పోరింది.

అతను బొజ్జ వూపుకుంటూ పకపకా నవ్వేవాడు.

"పిచ్చిదానా! క్లబ్‌లోనే అతిముఖ్యమైన ఆఫీసు లావాదేవీలూ, డబ్బు వ్యవహారాలూ జరుగుతాయి. అంచేత క్లబ్‌కెళ్ళడం తప్పనిసరి" అనేశాడు.

"సంపాదించింది చాలు. ఇక ఇలాంటి పనులు మానేద్దురూ" అంది తను అనునయంగా.

అతను తనొంక తిరస్కారంగా చూసి వూరుకున్నాడు.

ఒకవేళ, తనమీద మోజు తగ్గిందేమో? బయట ఎవరితోనన్నా... జానకి ఒక్కసారిగా త్రుళ్ళిపడింది. ఆమె ఆలోచనలు ఇక ఆదారిలో నడిచాయి.

❀❀❀

ఆర్టి.సి బస్ కాంప్లెక్స్ రణగొణ ధ్వనులతో నిండివుంది. వచ్చే బస్సులు పోయే బస్సులు అవీ, ఇవీ అమ్మే కుర్రాళ్ళ కేకలు. ఆ ధ్వనుల మధ్య అప్పుడప్పుడూ బస్సుల రాకపోకల గురించి అస్పష్టపు అనౌన్స్‌మెంట్లు.

రంగారావు బస్సు కోసం ఎదురు చూస్తూ కూర్చున్నాడు. వాళ్ళవూరికి పొద్దుటోసారి. సాయంత్రమోసారి బస్సు వెళ్తుంది. రాత్రి ఏడు గంటలయినా ఇంకా బస్సు రాలేదు. ఎంక్వయిరీ కౌంటర్ కెళ్ళి కనుక్కున్నాడు. "ఈవేళ మీ వూరికి బస్సు వెళ్ళదు. స్టాఫ్ లేరు" అని చెప్పడంతో రంగారావు ఉస్సూరుమంటూ ఓ బెంచీ మీద కూర్చున్నాడు.

వచ్చిన పని జరగలేదని అసలే విసుగ్గా వుంది. పైగా ఇప్పుడిదొకటి. వూరి వాళ్ళంతా తనమీద ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. పని జరగలేదంటే డీలా పడిపోతారు.

అకస్మాత్తుగా అతనికో వూహ కలిగింది. జానకితో చెప్పిస్తే....!

❀❀❀

గేటు తలుపులు తీసుకొని, ఇంట్లోకెళ్ళి కాలింగ్ బెల్ నొక్కాడు రంగారావు.

అప్పుడే స్నానంచేసి, బట్టలేసుకుని డ్రెస్సింగ్ టేబుల్ ముందు కూర్చున్న జానకి, "ఇప్పుడెవరొచ్చారబ్బా" అనుకుంటూ తలుపుతీసి,

"బావా! ఇదేనా రావడం" అంది ఆశ్చర్యంగా.

తలూపి, అలాగే నిల్చున్న రంగారావును చూసి, లోపలికి రమ్మని పిలిచింది.

రంగారావు మెత్తని సోఫామీద కూర్చుని, 'హమ్మయ్య' అనుకున్నాడు. ఇంతవరకూ బస్సుకోసం నిలబడి, తర్వాత నడిచీ వచ్చాడేమో సోపా హాయిగా వుంది.

"అంతా కులాసానా. మీ బాబేం చదువుతున్నాడు?".

"ఆ.. ఆరో తరగతి పాసయ్యాడు. మీ పాపేది"

"వాళ్ళమ్మమ్మ గారి ఊరెళ్ళింది".

జానకి మంచినీళ్ళు ఫ్రిజ్‌లోంచి తెచ్చి ఇచ్చింది.

రంగారావు జానకి వంక చూశాడు. ఇంతకు ముందుకంటే 'బావుంది' అనుకున్నాడు. కట్టూ బొట్టూ తీరువల్ల కూడా అందం పెరిగిందనుకున్నాడు.

చిన్నప్పుడు తమను మొగుడూ-పెళ్ళాలనేవారు అమ్మా, నాన్నా, అత్తా. తను పెరుగుతున్న కొద్దీ జానకినే పెళ్ళి చేసుకోవాలనుకున్నాడు. పెద్దలెలాగూ అదే ఉద్దేశంతో వున్నారు కాబట్టి, ఏ సమస్యా రాదనుకున్నాడు. జానకి కూడా "బావా, బావా" అంటూ తనతో గలాగలా మాట్లాడేది. ఎంత చురుగ్గా వుండేదో!

తీరా పెద్దవాళ్ళు పెళ్ళి ముహూర్తాలు పెట్టబోయేసరికి జానకి తనను పెళ్ళి చేసుకోనంది...

"బావా, లే, స్నానం చేయి భోంచేద్దాం" అంది జానకి.

స్నానం వగైరాలయ్యాక, రంగారావు డైనింగ్ టేబుల్ దగ్గరకెళ్ళి, కుర్చీలో కూర్చున్నాడు.

జానకి అతనికెదురుగా కూర్చుంది. రంగారావుకు కావాల్సినవి మరీమరీ అడిగి వడ్డిస్తూ, తనూ భోంచేస్తోంది. రంగారావు తన పని గురించి ఎలా కదపడమా అని ఆలోచిస్తూ భోంచేస్తున్నాడు.

ఆమె అతనివంక చూస్తోంది. కత్తిలాగున్నాడనుకుంది. "కాయకష్టం చేయడంవల్ల కాబోలు శరీరం గుల్లతేరలేదు" అనుకుంది. తలకాస్త వూడింది. మనిషి కొంచెం నలుపు దేరాడు.

రంగారావు తనంటే ఎంత ఇష్టపడుతున్నదీ తెలిసీ అతన్ని కాదనడానికి తను చాలా కష్టపడాల్సి వచ్చింది. మొదట మనసు మొరాయించింది. తర్వాత, తల్లి కోప్పడింది. అయితే, ఉద్యోగం చేసుకునేవాణ్ణి మాత్రమే తను పెళ్ళి చేసుకుంటానని తల్లితో కరాఖండీగా చెప్పేసింది. దాంతో, అలాంటి వరుడి కోసం తిరగక తప్పలేదు నాన్నకు. ఆ వేటలో చిట్టబ్బాయి తగిలాడు. కట్నకానుకల బేరాలయ్యేక చిట్టబ్బాయి తన వాడయ్యాడు. నిజంగా తనవాడయ్యాడా? కొంత కాలందాకా తనవాడే. డబ్బుపిచ్చి, తాగుడు పిచ్చి, క్లబ్బు పిచ్చి పట్టేవరకూ తనవాడిగానే వున్నాడు. ఆ తర్వాత పందిలా బలిశాడు. బానలా బొజ్జేసుకుని, ఎలుగుబంటిలా అప్పుడప్పుడూ వాటేసుకుంటూ... జానకి ఒక్కసారిగా తల విదిలించి చూసింది. రంగారావు గబుక్కున తలదించుకున్నాడు.

జానకిలో విపరీతమైన సంచలనం. మనసులో పిచ్చి ఆలోచన్లను మళ్ళించుకునే ప్రయత్నంలో- అతని కంచంలో మరికొంచెం అన్నంపెట్టి పెరుగువేసింది. మామిడి పండు తినమంది గలగలా నవ్వుతూ.

"ఇంకేంటి సంగతులు బావా" అంది.

తను వచ్చిన పనీ, పొద్దుట చిట్టబ్బాయ్ అన్న మాటలూ చెప్పాడు రంగారావు.

"జానకీ, నువ్వు చెబితే పనవుతుందేమో" అన్నాడు.

జానకి ముఖం పాలిపోయిందో క్షణం. ఆ వెంటనే తేరుకుని నీ పనయ్యేలా చూస్తాను. దాని గురించిక వర్రీకాకు" అంది అకస్మాత్తుగా.

జానకి మాటతో రంగారావు ముఖంలో కళొచ్చింది.

జానకి మరో మామిడిపండు వేయబోతుంటే, అతను చెయ్యి అడ్డం పెట్టాడు వద్దంటూ. జానకి అతని చేతిని పక్కకులాగి, కంచంలో మామిడిపండు వేసింది. రంగారావు ఒళ్ళు పులకరించింది. ఆ సంగతి జానకి గమనించింది.

'రంగారావును కాదని తప్పు చేశానా' అనుకుంది జానకి. కొంత తప్పుందేమోకానీ, పూర్తిగా తప్పు చేయలేదు' అనిపించిందామెకు. చిట్టిబ్బాయ్‌ని కట్టుకోవడంవల్ల తను కోరుకున్న 'నాజూకైన' జీవితం అమరింది. అయితే, ఐశ్వర్యం వల్ల కొన్ని ఐహిక సుఖాలు కోల్పోయింది. చిట్టిబ్బాయ్ కంటే ఎక్కువ డబ్బు సంపాదించిన వాళ్ళు తన ఎరుకలోనే కొందరున్నారు. వాళ్ళంతా ఈ పందిలానే ప్రవర్తిస్తున్నారా?

రంగారావు మామిడిపండు తింటూ అనుకున్నాడు-

జానకి తనదయ్యుంటే ఎంత బాగుండేదీ? ఎవరికి? తనకి. ఆమెకు బావుండక పోయుండేదేమో? ఇంత పెద్ద బంగళా, సిరిసంపదలు తనవల్ల ఆమెకు లభించేవా? జానకి తనను కాదని మంచిపనే చేసిందేమో?!

గడియారం తొమ్మిది గంటలు కొట్టింది. ఇద్దరూ ఉలిక్కిపడి ఒకరినొకరు చూసుకున్నారు. జానకి చిన్నగా నవ్వింది. రంగారావు శ్రుతికలిపాడు. ఇద్దరూ చేతులు కడుకున్నారు. జానకి తువ్వాలందించింది. అతను చేయి తుడుచుకున్నాడు. ఆమె ఇచ్చిన వక్కపొడి నోట్లో వేసుకుని, సోఫాలో కూర్చున్నాడు రంగారావు.

జానకి బెడ్‌రూంలో కెళ్ళింది. ఆమెకు చిన్ననాటి ముచ్చట్లు జ్ఞాపకమొస్తున్నాయి. ఎంత అణచాలన్నా అణగనంత వేగంతో. అద్దంలో చూసుకుంది. తువ్వాలుతో ముఖానికి పట్టిన చిరుచెమటను అద్దుకుని, కొద్దిగా పౌడరు రాసుకుని దువ్వెనతో తల పైపైన చెక్కుకుంది. అంతలో ఆమెలో ఆవేశం ఉప్పెనలా ముంచుకొచ్చింది. గుమ్మం దగ్గరకెళ్ళి హాల్లోకి చూసింది.

రంగారావు వీక్లీ తిరగేస్తున్నాడు.

"బావా, ఇలారా" అని పిలిచింది.

రంగారావు అయోమయంగా చూసి, లేచి వెళ్ళాడు.

జానకి విసురుగా బెడ్‌రూం తలుపేసి, గడియపెట్టింది.

❀❀❀

గడియారం పదకొండు గంటలు కొట్టింది. జానకి చీర సరిచేసుకుని, బీరువా తెరిచింది.

"బావా, ఇవిగో వెయ్యి రూపాయలు. ఇవి రేపాయన ముఖానకొట్టు. నీ పనవుతుంది. ఈ వందా కూడా వుంచు. ఏదన్నా లాడ్జికెళ్ళి పడుకుని రేపు ఉదయం ఆఫీసుకెళ్ళు. ఇంత రాత్రప్పుడు పంపేస్తున్నాని ఏమనుకోకు. ఇప్పుడిక్కడ నువ్వుంటే బావోదు" అని రంగారావు నుదురు చుంబించింది.

రంగారావు చేయి చాపలేదు.

జానకి అతని ముఖంలోకి చూసింది.

జరిగిన దానికి బెదిరినట్టు కనిపించాడు రంగారావు.

"అలా వున్నావేం, తీసుకో" అంది జానకి.

రంగారావు అలానే వుండిపోయాడు.

"బావా జరిగిందాని గురించి మరిచిపో. ఆ పంది, నోటుకిచ్చే విలువ నా మాటకు ఇవ్వదు. అందుకే ఈ డబ్బు ఇస్తున్నాను. ఇదంతా ఆ పంది ప్రజలదగ్గర నుంచి మింగిందే" అంటూ జానకి రూపాయి నోట్లను అతని చేతిలో పెట్టింది.

"........."

"నేను బాగా విసిగిపోయాను బావా. ఆ పందికి శిక్ష విధించాలని చాలా రోజులుగా అనుకుంటున్నాను. ఇవేళ్టికి అదీ, ఎవరో ముక్కూ ముఖం తెలియని వాడి ద్వారా కాకుండా, నన్ను కోరుకున్న నీ ద్వారా విధించినందుకు నాకానందంగా వుంది. మీ వూరికి ఏదోవిధంగా మేలు కలుగుతుందని కూడా తృప్తిగా వుంది. థాంక్స్ బావా" అంది జానకి మెరుస్తున్న కళ్ళతో.

'వెళ్లొస్తా' నన్నట్టు తలూపి, కదిలాడు రంగారావు. అతని మనసులో– స్వచ్ఛమైన చల్లని మంచినీళ్ళు తాగి, తృప్తిగా తేన్పుతున్న తనవూరి వాళ్ళ ముఖాలు మెదిలాయి.

*8 అక్టోబర్ 1989, ఈనాడు ఆదివారం*